క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



కంకిపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఈడుపుగల్లు గ్రామానికి చెందిన షేక్ సుభానివలీ అలియాస్ చిన్న సాంబయ్య(57) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చక్రవర్తి గ్రామానికి చేరుకుని సుభానివలీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, మాజీ సర్పంచ్ మాదు అరుణ్‌కుమార్, బీసీ నేత నకరికంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న పోలవరం కాల్వకట్టలు



విజయవాడరూరల్: పోలవరం కుడి ప్రధాన కాల్వకట్టలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటి వరకు కాల్వకట్ట మట్టిని అక్రమార్కులు లారీలతో, ట్రాక్టర్లతో తరలించి, సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం కట్టలను ఆక్రమించుకొంటున్నారు. పోలవరం కుడి ప్రధాన కాల్వ 6, 7 ప్యాకేజీల్లో కాల్వకు ఆనుకొని ఉన్న కాల్వకట్ట ఖాళీ స్థలాలను గ్రామాల్లో ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారు. ఆక్రమణల గురించి పోలవరం అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని, ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంలో గురువారం అగ్ని ప్రతిష్ఠ, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం తదితర విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఉదయం 10 గంటలకు త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీవారికి పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన, 108 కలశాలతో అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీవారికి రాయబారోత్సవం ఘనంగా చేస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

శిథిలావస్థలో ఏనుగుల కోడు వంతెన



గొడవర్రు - రొయ్యూరు గ్రామాల మధ్య ఏనుగుల కోడుపై ఉన్న వంతెన



ధ్వంసమైన ఇనుప రెయిలింగ్

- ధ్వంసమైన ఇనుప రెయిలింగ్
- రెండు నియోజకవర్గాలకు ప్రధాన వంతెన
- భయం భయంగా రాకపోకలు సాగిస్తున్న వైనం

కంకిపాడు: ఏనుగుల కోడుపై వంతెన శిథిలావస్థకు చేరుతోంది. రెండు నియోజకవర్గాల పరిధిలోని ఈ వంతెనకు ఏళ్ల తరబడి మోక్షం లభించటం లేదు. ప్రస్తుతం ఓ వైపు రెయిలింగ్ పూర్తిగా ధ్వంసమై వంతెన ప్రమాదకరంగా తయారైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. పెనమలూరు మండలం తాడిగడప గ్రామం నుంచి మురుగుతో పారుదల అయ్యే ఏనుగుల కోడు కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల మీదుగా ఫత్తేలంక వద్ద గుండేరు డ్రెయిన్‌లో కలిసి నేరుగా సముద్రంలోకి చేరుతుంది. పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం గొడవర్రు, పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామాల నడుమ కంకిపాడు–రొయ్యూరు రోడ్డు మార్గం ఉంది. గొడవర్రు–రొయ్యూరు ఈ రెండు గ్రామాల మీదుగా ప్రవహించే ఏనుగుల కోడుపై వంతెన నిర్మించారు. వంతెన నిర్మించి దశాబ్దాలు గడిచాయి.

శిథిలావస్థకు చేరువగా...

వంతెన కాలక్రమేణా శిథిలావస్థకు చేరుతోంది. ఈ మార్గం మీదుగా హెవీ లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాల ధాటికి వంతెనకు ఇరువైపులా ఏర్పాటుచేసిన ఇనుప రెయిలింగ్‌లు ధ్వంసమైపోతున్నాయి. ఓ వైపు పూర్తిగా ధ్వంసమై ఏనుగుల కోడులో కొట్టుకుపోయింది. మిగిలిన మరో వైపు రెయిలింగ్ దెబ్బతింది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3.75 కోట్లతో గొడవర్రు–రొయ్యూరు రోడ్డు అభివృద్ధి పరిచారు. అయితే వంతెన అభివృద్ధి అంశాన్ని మాత్రం విస్మరించారు. దీంతో రోడ్డు అభివృద్ధి జరిగి రాకపోకలు సాగుతున్నా వంతెన ఎప్పుడు కూలిపోతుందోనన్న భయం మాత్రం ప్రజలను వెంటాడుతోంది.

వంతెన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి..

వంతెన శిథిలావస్థకు చేరటంతో కరకట్ట నుంచి కంకిపాడు మార్గం, ఈ వైపు నుంచి కరకట్ట మీదుగా ప్రయాణికులు బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రిళ్లు వంతెన మార్జిన్లు కనిపించక దెబ్బతిన్న ఇనుప రెయిలింగ్‌లను ఢీకొని వాహనదారులు గాయపడుతున్నారు. ప్రాణాలు అరచేత పట్టుకుని వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఈ వంతెన అభివృద్ధికి కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కంకిపాడు: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా గురువారం కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంలో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా చదువుపై ఏకాగ్రత, పట్టుదల, శ్రద్ధ అలవడతాయన్నారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో డి.లక్ష్మి కుట్లు, అల్లికల్లో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. భగవద్గీత శ్లోకాలను పఠించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్విజ్, ఖోఖో, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగి పడమట రమేష్‌కుమార్ గ్రంథాలయ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిమట రామారావు, లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



గన్నవరంలో విద్యార్థులతో రమేష్‌కుమార్

పెనమలూరు: విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని వణుకూరు గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. వణుకూరు గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. భారతి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయటం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం సుమతి శతకం, తోక కథలు చెప్పించారు. ఆటపాటలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం విద్యార్థులకు ఆంగ్లకథల పుస్తకాలను పరిచయం చేశామని గ్రంథాలయ అధికారి స్వర్ణలతాదేవి చెప్పారు. పెద్దబాలశిక్ష పుస్తకం చదివించారు.

వరిగడ్డివాము దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో వరిగడ్డివాము అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ జాన్ బాషాతో పాటుగా షేక్ మస్తాన్ వలి, కాలీషాలకు చెందిన 15 ఎకరాల వరి గడ్డివాము అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదైంది. తొలుత జాన్‌బాషా వరిగడ్డి వాము నుంచి బుధవారం రాత్రి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఇరుగుపొరుగు వాళ్లంతా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. క్రమంగా పక్కన ఉన్న మస్తాన్ వలి, కాలీషాల గడ్డివామికి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లుగా భావిస్తున్నారు. రూ.1.80 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లుగా అగ్నిమాపక అధికారులు ప్రాథమిక అంచానా వేశారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

పెనమలూరు: పోరంకి శ్రీనగర్‌కాలనీలో వేం చేసి ఉన్న శ్రీకోదండ రామాలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గురువారం స్వామివార్ల విగ్రహాలను గ్రామంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగబోయే ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని పలు పూజలు నిర్వహించారు.

ఆలయంలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రమూర్తి, వినాయక, సర్పరూప సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌కాలనీలో స్వామివార్ల విగ్రహాలను, కలశం, సుదర్శన చక్రాలను ఊరేగించారు. స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి, పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి కోరారు.



దేవతా విగ్రహాలకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి గ్రామసభలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జనాభా నిర్వహణ విధానంపై గ్రామగ్రామాన ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు గ్రామసభలు నిర్వహించాలని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన జనాభా నిర్వహణ విధానంపై ఈ నెల 6వ తేదీ నుంచి 20 వరకు గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసేందుకు గ్రామసభలను నిర్వహించాలన్నారు. ప్రతి ఇంట్లో ఎంత మంది యువత ఉన్నారు, వాళ్లు గ్రామాల్లోనే ఉంటున్నారా? లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా ? అనే అంశాలను సేకరించాలని చెప్పారు.

నున్నలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి నున్న పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం జరిగింది.

కౌలుదారులందరికీ అన్నదాత సుఖీభవ అందజేయాలి

ఉంగుటూరు(గన్నవరం): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి కౌలురైతుకు పెట్టుబడి సాయం అందించాలని కౌలుదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో కౌలుదారుల సంఘం తరఫున గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయంలో 80 శాతం కౌలురైతులు సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల కారణంగా 10 శాతం కౌలుదారులకు మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు అందుతున్నాయని చెప్పారు. మిగిలిన కౌలుదారులకు ప్రభుత్వం నుంచి లబ్ధి అందకపోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు చేసి వ్యవసాయం చేయడం కష్టతరంగా మారిందన్నారు. ఇప్పటికైనా కౌలు గుర్తింపు కార్డులతో సంబంధం లేకుండా అర్హులైన కౌలుదారులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కోరారు. సంఘ నేతలు షేక్ సలీం, బాబూరావు, అజ్మీరా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాస్తవ సాగుదారులకు అందించాలి

కంకిపాడు: అన్నదాత సుఖీభవ పథకాన్ని వాస్తవ సాగుదారులందరికీ అందించాలని కౌలురైతు సంఘం మండల నేత తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలురైతుల సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేశారు. నరేష్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం గుర్తింపు కార్డులు ఉన్న కౌలురైతులతో పాటు గుర్తింపుకార్డులు లేని కౌలురైతులకూ వర్తింప చేయాలన్నారు. జిల్లాలో అధిక శాతం సాగు కౌలురైతుల చేతుల్లోనే ఉందన్నారు. వీరంతా పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారుల వైపు చూస్తున్నారన్నారు. కౌలురైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని, రూ.20 వేలు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చిక్కవరపు శ్రీహరి, గద్దం రాజా, పచ్చిగళ్ల నాగరాజు, వెంట్రపల్లి జోజి, వెంట్రప్రగడ మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు, ఆత్కూరు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంగుటూరు, కొయ్యగూరపాడు, ఆత్కూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

10 నుంచి ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆధార్ కార్డు నమోదు, సవరణల నిమిత్తం ఈ నెల 10వ తేదీ నుంచి గ్రామగ్రామాన ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11 తేదిల్లో మడిచర్ల, తిప్పనగుంట, ఎ.సీతారామపురం గ్రామాల్లో, 12,13 తేదిల్లో వేలేరు, బండారుగూడెం, ఆరుగొలను గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు.

అన్ని మార్పులకు అవకాశం..

24, 25 తేదీల్లో రేమల్లే, కోడూరుపాడు, కె.సీతారామపురం గ్రామాల్లో, 26, 27 తేదీల్లో బాపులపాడు, రంగన్నగూడెం గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు చేయటం, ఐదేళ్లు నిండిన చిన్నారులకు ఆధార్ అప్‌డేట్, పేరు, చిరునామాల సవరణలు వంటి సేవలు ఈ శిబిరాల్లో నిర్వహిస్తారని ఎంపీడీవో చెప్పారు. 27వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కంకిపాడు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వనం–మనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం రోజు రోజుకీ పెరిగిపోతుందన్నారు. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. పరిపాలనాధికారి బసవయ్య, మండల పరిషత్, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గ్రీనరీ అభివృద్ధికి చర్యలు

గన్నవరం: వన మహోత్సవంలో భాగంగా చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి సెంట్రల్ డివైడర్‌పై స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి సుందరీకరణలో భాగంగా ఎయిర్‌పోర్ట్ నుంచి గన్నవరం వరకు గ్రీనరీ అభివృద్ధి చేస్తామన్నారు. సుమారు 2.7 కిలోమీటర్లు గ్రామ పంచాయతీ నిధులతో మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. బాపులపాడు, రామవరప్పాడు వద్ద కూడా గ్రీనరీ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బీకేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో..

స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్.కిశోర్ నేతృత్వంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ బిందు కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి



సనత్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు



గన్నవరంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ, నాయకులు



కంకిపాడులో మొక్క నాటుతున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

గన్నవరంలో మొక్కల పంపిణీ

గన్నవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ నేతృత్వంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం మొక్కలు పంపిణీ చేశారు.

అనంతరం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిశోర్‌కు పలు రకాల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో హిందుస్థాన్ ఏవియేషన్ మేనేజర్ వీరేంద్రప్రసాద్, మానవతా అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి కర్రా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న హిందుస్థాన్, మానవత ప్రతినిధులు

తుట్టగుంట(గన్నవరం): ఉంగుటూరు మండలం తుట్టగుంట గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచి బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా ప్రజలందరూ గుర్తించాలని చెప్పారు. ఉప సర్పంచ్ చింతపూడి నాగభూషణం, గ్రామ పెద్దలు పిల్లి రాజారావు, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాబూరావు, నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటండి

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కానూరు సనత్‌నగర్‌లో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, చిన్నారులు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వణుకూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. గృహాలలో ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంతో అనేక సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కాశేశ్వరీదేవి, వి.జ్యోతి, కె.శిరీష, పి.రంగమ్మ, పి.అనిత, చిన్నారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీడాలి

రామవరప్పాడు: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిడమానూరులోని కమ్యూనిటీ హాల్ వద్ద పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షిస్తే పచ్చదనం విరాజిల్లుతుందన్నారు. అలాగే ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించి గుడ్డ సంచులు వాడాలని, సైకిల్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో పర్యావరణ దినోత్సవం

ఎయిర్‌పోర్ట్(గన్నవరం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో గురువారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో మొక్కలు నాటారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు అనిల్‌కుమార్ గుప్తా, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ కామేశ్వరరావు చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్‌లో మొక్కలు నాటించారు. బ్యాంక్ విజయవాడ రీజినల్ హెడ్ అనుపమ్ శ్రీవాస్తవ, డెప్యూటీ రీజినల్ హెడ్ రమేష్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సర్పంచి కృష్ణారెడ్డి



వెటర్నరీ కళాశాలలో..



ఎయిర్‌పోర్ట్‌లో మొక్క నాటుతున్న ఎయిర్‌పోర్ట్, బీఓబీ అధికారులు